కిక్కిరిసిన బస్సులో నుంచి కిందికి దిగడమే కష్టమయింది దినకర్‌కి. హైదరాబాద్ మహా నగరంలో బస్సు ప్రయాణమంటేనే నరకం. ముఖ్యంగా ఆఫీస్ టైమింగ్స్‌లో. మనిషిని మనిషి హత్తుకుపోయి, ఊపిరాడని స్థితిలో ప్రయాణించాక ఎక్కేవాళ్లు, దిగే వాళ్ళ తోపులాటలో నుంచి బయట పడడమంటే పద్మవ్యూహం నుంచి ప్రాణాలతో బయటపడినంత సంతోషం కలుగుతూంటుంది.



# అడ్జస్ట్‌మెంట్

దినకర్ బస్సు దిగాక ఇంటివైపు నడవ సాగాడు.


సూర్యుడు పశ్చిమ దిక్కులో పూర్తిగా కుంగి పోలేదు. కానీ ఆకాశ హర్మ్యాల మధ్య ఆయన రోజువారీ డ్యూటీ త్వరగా ముగిసిపోయినట్టు కనుమరుగైపోయాడు. సూర్యుడు చాటుగా దాక్కోవడంతో అప్పుడప్పుడే చీకటి తెర కాంక్రీట్ జంగిల్‌ని కప్పడానికి ఆయత్తమవుతోంది.

దినకర్ ఇల్లు చేరేసరికి గాయత్రి వాకిట్లోనే నిలబడి అతడి కోసం ఎదురుచూస్తోంది. అతడు దగ్గరకు రాగానే, కాసింత చిరాగ్గా ముఖం పెట్టి అంది. "ఏమిటండీ! ఉదయమే చెప్పాగా... ఈ రోజు కాస్త త్వరగా ఇంటికి రమ్మని. రాజేశ్వరక్కావాళ్లు తయారయి, మన కోసమే ఎదురుచూస్తున్నారు."

అసలే అలసటగా ఉన్నాడు అతడు. భార్య మాటలకు మరింత నీరసపడిపోయాడు. నిజానికి తను ఆఫీసులో పనిచేస్తున్నా, ఉదయం ఆఫీసుకు బయలుదేరేముందు భార్య చెప్పిన మాటలు గుర్తుకొస్తూనే ఉన్నాయి ఉదయం బయలుదేరేముందు ఆమె చెప్పింది... "ఏమండీ! మన హౌస్ ఓనర్ రాజేశ్వరక్కావాళ్లు సాయంత్రం ఎగ్జిబిషన్‌కి వెళ్తున్నారట. మనల్ని కూడా రమ్మని పిలిచిందండీ."

తను ఆమెకేసి ఇబ్బందిగా చూసాడు. ఎగ్జిబిషన్ అంటే ఆటోకైతేనేం, టిక్కెట్లకూ, అక్కడ తినడానికి – అంతా ఓ వంద రూపాయలు ఖర్చయిపోతాయి. అసలే నెలాఖరు రోజులు. అందులోనూ బడ్జెట్ బ్రతుకులు. జీతం పదో తారీఖున వస్తుంది. కానీ ఒకటో తారీఖే ఖచ్చితంగా ఇంటద్దె కట్టాలి. అందుకోసం ఉంచిన వెయ్యి రూపాయలు మాత్రమే తన దగ్గర ఉన్నాయి. ఇప్పుడు ఎగ్జిబిషన్‌అంటే, అందులో కొంత లోటు.

అప్పటికీ అతను పెదాల మీదకు అతి కష్టం



కోలపల్లి ఈశ్వర్

మీద నవ్వు కొని తెచ్చుకుని "వాళ్లేదో వెళ్తుంటే పిలిచారనుకో... పానకంలో పుడకల్లా మనమెందుకోయ్" అన్నాడు.

"వెళ్తుంటే ఏదో పిలిచామని పిలవడం కాదు, మనం వస్తామంటేనే వాళ్లు బయలుదేరుతారట. కంపెనీగా ఎవ్వరూ లేకపోతే వెళ్లడం ఎందుకులే అని వాళ్లూ మానుకునేలా ఉన్నారు..."

ఇక వద్దని చెప్పడం ఎలాగో అర్థం కాలేదు తనకు. తల నిలువుగానో అడ్డంగానో ఎలా ఆడించాడో, తెలియకుండానే తలాడించాడు. అంతే... ఆమె ముఖం వెలిగిపోయింది. వెలిగిపోతున్న ఆమె ముఖం చూస్తే తనకూ సంతృప్తిగా అన్పించింది. ఆ సంతృప్తితోనే ఆఫీసుకు వెళ్లాడు.

అయితే ఆఫీసులో పనిచేస్తున్నాడన్న మాటేగానీ, మనసంతా రాబోతున్న ఖర్చు మీదనే నిలిచిపోయింది. ఎలాగోలా ఆ ప్రోగ్రామ్ నిలిచిపోతే బాగుండునని మనసులో అనుకున్నాడు.

కానీ... ఇప్పుడు గాయత్రి మాటలు విన్నాక... ఇక తప్పదనే అనిపించింది.

"మీరు త్వరగా తయారయితే, బయల్దేరదాం." గాయత్రి తొందర చేస్తుంటే దినకర్ ఇంట్లోకి నడిచాడు.

బాత్‌రూమ్‌లోకెళ్లి ముఖం కడుక్కుని, డ్రస్ మార్చుకునే సరికి వాకిట్లో రెండు ఆటోలు రెడీగా ఉన్నాయి. రాజేశ్వరి, ఆమె భర్త యాదగిరి, పిల్లలు వీధిగేటు దగ్గర నిలబడి ఉన్నారు. అతడిని చూడడంతోనే యాదగిరి పలకరింపుగా నవ్వి "రెడీ అయ్యారా సార్" అని ప్రశ్నించాడు.

అతను తలాడించాడు. గాయత్రి ఇంటికి తాళం వేసింది.

మరు నిమిషమే ఆ ఇంటి నుంచి ఆటోలు కదిలి ముందుకుసాగాయి.

ఆటోలు ఎగ్జిబిషన్ ముందు ఆగాయి. వద్దు వద్దంటున్నా యాదగిరే ఆటోఫేర్ చెల్లించాడు. ఆటోఫేర్ వాళ్లు చెల్లిస్తే, ఎగ్జిబిషన్ టిక్కెట్లన్నా తను తీసుకురావాలి కదా?! దినకర్ పాతిక రూపాయలు పెట్టి అందరికీ టికెట్స్ తెచ్చాడు.

అందరూ ఎగ్జిబిషన్ లోపలికెళ్లారు.


యాదగిరికి సొంత ప్రింటింగ్ ప్రెస్ ఉంది. సొంత ఇల్లు. పైగా ఇంటి అద్దెల రాబడి బాగానే ఉంది. అందువల్ల వాళ్లు జల్సాగా ఖర్చుపెడుతున్నారు. వాళ్లలా ఖర్చుపెడుతుంటే గాయత్రి ఇబ్బందిపడడం గమనించాడు దినకర్.

అప్పటికీ అతడు ఎంతో కొంత ఖర్చుపెడుతూనే ఉన్నాడు. యాదగిరి వందనోటు మారిస్తే, దినకర్ జేబులోని యాభైనోటు కరిగిపోతోంది.

వాళ్లంతా జెయింట్ వీల్ ఎక్కారు, మేజిక్ చూసారు. పానీ పూరీ తిన్నారు. ఇంటికి కావలసిన చిన్నచిన్న వస్తువులు కొనుక్కున్నారు.

చివరగా ఓ షాపులో మంచి బెడ్‌షీట్స్ అమ్ముతూంటే రాజేశ్వరి కొనుక్కుంటూ "నువ్వూ తీసుకో గాయత్రీ! చాలా చీప్. బాగున్నాయి కూడా" చెప్పింది.

గాయత్రి భర్త ముఖంలోకి చూసింది. అప్పటికే వెయ్యి రూపాయల్లో రెండు వందలు ఖర్చయిపోయాయి. రెండు వందలంటే ఎలాగోలా అడ్జస్ట్ చేయవచ్చు. కానీ ఇప్పుడు ఆ బెడ్ షీట్స్ కొనుక్కోవడమంటే, మరో రెండు వందలు ఖర్చు చేయాలి. నెలాఖరులో నాలుగు వందలు అప్పు పుట్టించడమంటే మాటలు కాదు... అందుకే అతడు ఇబ్బందిగా ముఖం పెట్టాడు.




కానీ గాయత్రి చిన్నగా గొణిగింది. "రాజేశ్వరక్క చెబుతూ ఉన్నా తీసుకోకపోతే ఏదోలా ఉంటుంది... ప్లీజ్! అవి కూడా చాలా బాగున్నాయి. ఇప్పుడు తీసుకోకపోతే మళ్లీ మనకు అంత చీప్‌గా దొరకవు..."

దినకర్ పొంగుకొస్తున్న కోపాన్ని అణచుకుంటూ రెండొందలు ఆమె చేతిలో పెట్టేసాడు. గాయత్రి ఈసారి అతడి ముఖంలోకి చూడకుండానే బెడ్‌షీట్స్ కొనేసింది.

ఎగ్జిబిషన్‌లో తిరగడం, షాపింగ్ చేయడం పూర్తయింది. ఆటోల్లో అందరూ ఇంటికి చేరుకున్నారు.

ఇంటికి రావడంతోనే దినకర్ బెడ్ మీద ముడుచుకుని పడుకున్నాడు.

గాయత్రి వంట చేయడం పూర్తి చేసాక, అతడిని తడుతూ పిలిచింది. "లేవండి భోంచేద్దాం."

దినకర్ మరింత ముడుచుకుపోయాడేగానీ లేవలేదు. గాయత్రి అప్పుడే అతడి వాలకం గమనించినట్టుగా "ఏమిటలా ఉన్నారు?" ప్రశ్నించింది.

"ఏం లేదులే. నాకాకలిగా లేదు పడుకోవాలి." అతడు కనీసం తల తిప్పి ఆమెకేసి చూడలేదు.

"లేవమంటూంటే..." గాయత్రి భర్త భుజం పట్టుకుని లాగింది.

అతడు కోపంగా ఒక్క ఉదుటున లేచి కూర్చుని "ఏమిటి?... ఏమిటే నీ గోల?!... నన్నెందుకిలా విసిగిస్తావ్? ఆకలి లేదని చెపుతున్నాగా" అనేసి మళ్ళీ పడుకోబోతూంటే ఆమె అతడిని బలవంతంగా కూర్చోబెట్టింది. ఆమెకు అతడి కోపానికి కారణం లీలగా అర్థమయింది.

"ఎందుకంత కోపం?"

"కోపం కాదు... ఎల్లుండి వాళ్లకు అద్దె ఎలా అడ్జస్ట్ చేయాలో ఆలోచిస్తూంటే నాకు ఆకలి చచ్చిపోవడమే కాదు. ఈ రాత్రికి నిద్ర కూడా పట్టేలా లేదు."

"అది కాదండీ..." ఆమె మరేదో చెప్పబోయింది.

"ఇంకేం మాట్లాడకు... తిని పడుకో" దినకర్ ఆమె పట్టు నుంచి బలవంతంగా విడివడి, మళ్లీ ముడుచుకుని పడుకుండిపోయాడు.

గాయత్రి కొద్ది క్షణాలు భర్తకేసి అదోలా చూసింది. అతడి కోపం ఇప్పట్లో తగ్గేది కాదని ఆమెకు తెలుసు. భర్త తినకుండా, తను తినలేక ఆమె కూడా అలాగే ఖాళీ కడుపుతో అతడి పక్కనే నడుం వాల్చింది.

ఇంచుమించు అర్ధరాత్రి వరకూ పక్క మీద అటూఇటూ దొర్లాడు దినకర్. ఆకలి అతడిని అంతగా బాధించలేదుగానీ, తనతో పాటు గాయత్రి కూడా పస్తుపడుకోవడంతో అతడి గుండె కింద నరమేదో కదిలి, తనను తాను ప్రశ్నించుకునేలా చేసింది.

"ఛీఛీ!... గాయత్రి మీద అంతలా కోప్పడ్డం తప్పుకదూ? అయినా తానేమన్నా పట్టు చీరలడిగిందా - బంగారు నగలు చేయించమందా? జస్ట్! బెడ్‌షీట్స్ కొంటానంది. అదీ తన కోసమేం కాదు కదా?!... భర్త అన్నాక భార్య పది కోరికల్లో ఒకటీ, రెండన్నా తీర్చగలగాలి. ఎప్పుడో సంవత్సరానికో రోజు షికారుగా బయటికెళితే ఆ రోజు కూడా మరీ పిసినారిలా ప్రవర్తించడం... అఫ్‌కోర్స్! సమయానికి డబ్బు లేదు కదా అంటే, అసలు ఎప్పుడు తన దగ్గర డబ్బు ఉండి ఏడ్చింది? ఏదో అనుకోని ఖర్చులొస్తే

> మీరు బయటికి వెళ్లివచ్చేటప్పటికి బీరువాలోని సామాన్లనీ చిందరవందరగా క్రింద పడేసి ఉన్నప్పటికీ వెంటనే ఎందుకు కంప్లయింట్ చేయలేదు? ప్రశ్నించాడు ఎస్.ఐ.
>
> "మా ఆయన తనకు నచ్చిన బట్టలు తీసుకొని ఉంటారులే అనుకొన్నాను" చెప్పింది భార్యామణి భర్తవైపు కొరకొరా చూస్తూ.
>
> – వై.కె. మూర్తి, విజయవాడ

మరోలా అడ్జస్ట్ చేసుకోవాలి. అది మగాడి బాధ్యత...

మదిలో కదలాడిన ఆ ఆలోచన అతణ్ణి తనను తాను తిట్టుకునేలా చేసింది. అతడు పశ్చాత్తాపపడుతూ ఇటు తిరిగి, గాయత్రి నడుం మీద చెయ్యేసి దగ్గరగా జరిగాడు. చెవి దగ్గరగా ముఖం చేర్చి చిన్నగా గొణిగాడు. "సారీ గాయత్రీ!... ఏదో కోపంలో..."

అప్పటివరకూ ఆమె కూడా మేలుకునే ఉందేమో! చప్పున అతనివైపు తిరిగి అతడి నోటికి తన చెయ్యి అడ్డుగా ఉంచింది.

"మీరెందుకు సారీ చెప్పడం? మీ కష్టం అర్థం చేసుకోకుండా లేనిపోని డాబులకెళ్లి మీ చేత అనవసరంగా ఖర్చుపెట్టించినందుకు నన్ను నేను తిట్టుకోవాలి. రాజేశ్వరక్క నా చేత బెడ్‌షీట్స్ కొనిపించిందిగానీ, రేపు అద్దె రెండు రోజులు ఆలస్యమయిందంటే ఓర్చుకుంటుందా?... ఓర్చుకోదు... అసలు నాదే బుద్ధి తక్కువ..."

"పోనీలే జరిగిందేదో జరిగిపోయింది భోం చేద్దాం లే..." ఆమెను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు దినకర్. ●